

బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.1,02,380
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.9,257
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.1,12,700
రిటైల్ వెండి గ్రాము రూ.115.70

క్లుప్తంగా

ఆటోలో ప్రయాణిస్తుండగా..


ఘటనాస్థలిలో మృతి చెందిన చంద్రశేఖర్ రెడ్డి

చంద్రగిరి: రోడ్డు ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడు మృతిచెందిన ఘటన మండల పరిధిలో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పాకాల మండలం శంఖంపల్లికి చెందిన ఆటో డ్రైవరు కిషోర్ బుధవారం తెల్లవారుజామున నేండ్రగుంట నుంచి న్యూస్‌పేపర్లను వేసుకుని తిరుపతికి పయనమయ్యాడు. పాకాల మండలం గాలివారిపల్లికి చెందిన ధనశేఖర్ రెడ్డి(36), రేణిగుంటకు చెందిన రాజశేఖర్, ప్రతాప్‌లను ఆటోలో ఎక్కించుకున్నాడు. అయితే మామండూరు వద్ద ఆగి ఉన్న వాహనాన్ని కిషోర్ వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో చంద్రశేఖర్ రెడ్డి ఆటో డ్రైవరు పక్కన కూర్చుని ఉండడంతో అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు ప్రయాణికులు గాయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యోగాడేని విజయవంతం చేద్దాం

తిరుపతి అర్బన్: ఈనెల 21న యోగాదినోత్సవం సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. బుధవారం ఆయన కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తోపాటు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, డీఆర్వో నరసింహులు పలు విభాగాలకు చెందిన అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21న తిరుపతిలోని తారకరామ స్టేడియంలో 10వేల మందితో పెద్దఎత్తున యోగా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. మున్సిపల్ కార్పొరేషన్ వారు శానిటేషన్, తాగునీరు ఏర్పాటు, వైద్య ఆరోగ్య శాఖవారు హెల్త్ క్యాంపులు నిర్వహించాలని, జిల్లా పోలీస్ యంత్రాంగం ట్రాఫిక్ నియంత్రించడంతో పాటు అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలని ఆదేశించారు. పలు యూనివర్సిటీల నుంచి విద్యార్థులు, సిబ్బంది పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని వీసీలను ఆదేశించారు. 21న శనివారం ఉదయం 6 గంటలకే అందరూ హాజరయ్యేలా చూడాలని తెలిపారు. తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, యూనివర్సిటీల వీసీలు, జిల్లా పంచాయతీ అధికారి సుశీల దేవి, సాంఘిక సంక్షేమ అధికారి విక్రం కుమార్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ అధికారి బాలకృష్ణ నాయక్ పాల్గొన్నారు.

మామిడి విలవిల


తవణంపల్లి: ఎఫ్‌-3 ఫ్యాక్టరీ వద్ద మామిడి కాయలు అన్‌లోడ్ చేయడానికి క్యూ కట్టిన ట్రాక్టర్లు

మామిడి రైతు దిగుబడులను విక్రయించేందుకు అగచాట్లు పడుతున్నారు. పండ్లు పక్వానికి వచ్చినా కోయలేక అన్నదాత విలవిలలాడుతున్నారు. ఫ్యాక్టరీలు, ర్యాంపులు కాయలు కొనడానికి ముఖం చాటేయడంతో ఆవేదన చెందుతున్నారు. అధికారుల చెప్పిన రేటు ఎక్కడా అమలు కావడంలేదని ఆందోళన చెందుతున్నారు. మరోవైపు కాయలు తీసుకొనేందుకు జులై వరకు టోకెన్లు ఇవ్వడంపై అన్నదాతలు మండి పడుతున్నారు. తోటల్లో కాయ పక్వానికి వచ్చి రాలిపోతుంటే...గడువు మరో 15 రోజుల వరకు ఇవ్వడం ఏంటని నష్ట పరిహారం ఇవ్వకపోతే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- పంటను అమ్ముకోవడానికి ఫలరాజు పాట్లు
- అన్నదాతలకు కోతల కన్నీళ్లు
- ముఖం చాటేస్తున్న ఫ్యాక్టరీలు.. చివరికి ర్యాంపులూ
- రాలిపోతున్న కాయలు.. నష్ట పరిహారం ప్రకటించాలి


చిత్తూరు మార్కెట్‌కు వచ్చిన మామిడి కాయలు

కాణిపాకం : జిల్లాలో మామిడి విపత్తు ఎదురవుతోంది. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు. పంట పక్వానికి వచ్చినా కోతలు కోయలేక కన్నీళ్లు పెడుతున్నారు. ఫ్యాక్టరీలు ముఖం చాటేస్తున్నాయి. ర్యాంపులు ఇదే దారిలో పయనిస్తూ... కాయలను కొనలేమని చేతులెత్తేస్తున్నాయి. టోకెన్లు గడువు ఉన్నంత వరకు కాయలకు గడువులేదని... ప్రభుత్వం ప్రోత్సాహక నిధి ప్రకటించి రైతుల గోసను గాలికొదిలేసిందని రైతులు ఆక్రోశానికి గురవుతున్నారు.

టోకెన్ ఉన్న రైతుల పరిస్థితి ఇదీ..

మామిడి రైతులు పండించిన పంట విక్రయానికి జిల్లాలోని ఫ్యాక్టరీల వద్దకు పోటెత్తుతున్నారు. వేల మంది రైతులు ఒక్కసారిగా ఫ్యాక్టరీలను ముట్టడిస్తున్నారు. ఈపోరు పడలేక ఫ్యాక్టరీలు, అధికారులు కలిసి వచ్చిన వారి అందరికీ టోకెన్లు పంచిపెట్టేస్తున్నారు. ఈ టోకెన్ల జారీ జూన్ నెల దాటింది. పలు ఫ్యాక్టరీలు జులై నెల ఆఖరు వరకు కొనుగోలు చేస్తామని టోకెన్లు ఇచ్చేసింది. మరో వారం, పది రోజుల్లో మామిడి పంట పూర్తిగా నేలమట్టమయ్యే అవకాశం ఉందని రైతులు కంట తడి పెడుతున్నారు. ఈ తరుణంలో జులై నెల ఆఖరు వరకు పంట ఉండదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాయ పండై..పురుగు పట్టి రాలిపోవడం ఖాయమని కన్నీళ్లు కారుస్తున్నారు. ఇప్పటి వరకు 30 శాతం వరకు మాత్ర మే పంట అమ్ముడుపోయినట్లు రైతులు చెబుతున్నారు.

నష్టపరిహారం ఇవ్వాల్సిందే...

మామిడి పంటను కోసి అమ్ముకునే పరిస్థితి లేదని రైతులు దిగాలు చెందుతున్నారు. ఫ్యాక్టరీలు జిల్లా మామిడిని తోసి పుచ్చుతున్నాయంటూ గోల చేస్తున్నారు. సిఫార్సులకు పెద్దపీట వేస్తూ...సామాన్య రైతు కష్టాన్ని పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు.

చేతులెత్తేసిన ర్యాంపులు

జిల్లాలో ఇప్పటి వరకు 23 ర్యాంపులు నడుస్తున్నాయి. ఈ ర్యాంపులకు రోజువారీగా ఒక్క లారీ నుంచి రెండు లారీలా వరకు ఫ్యాక్టరీలకు అమ్ముకోవడానికి అనుమతులున్నాయి. ఈ ర్యాంపును నిర్వర్తించే వ్యాపారులు సొంత కాయలు, బంధువులు, తెలిసినా వాళ్ల మామిడి కాయలు అమ్ముకోవడానికి మాత్రమే ప్రాధాన్యం ఇస్తున్నారు. మిగిలిన రైతుల మామిడిని కొనలేమని, ఫ్యాక్టరీ వాళ్లు తీసుకోవడం లేదని తలుపులు వేసేస్తున్నారు. ర్యాంపులకు వెళ్లిన రైతులకు వారం తర్వాతే కాయలు కొంటామని చెప్పేస్తున్నారు. అధికారులు చెప్పిన రేటు (రూ.3.50) కుదరదని, రూ.3 నని, మరో వారం తర్వాత ఆ రేటు చెప్పలేమని రైతులకు సమాధానమిస్తున్నారు. దీంతో మామిడి రైతులు తల్లడిల్లిపోతున్నారు.

ఒక్క టోకెన్ స్వామీ...!

జిల్లాలో మామిడి రైతుల పరిస్థితి అయోమయంగా మారింది. ఫలంపై ఆశలు వదులుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. తోటలోని కాయలు మట్టిపాలవుతున్నాయి. రైతులు ఫలం పరిస్థితి చూసి కన్నీళ్లు కారుస్తున్నారు. చాలా మంది కాయలను అమ్ముకోవడానికి ఫ్యాక్టరీల వద్దకు పరుగులు పెడుతున్నారు. వారి అనుమతి కోసం బంగారుపాళ్యం, చిత్తూరు, గుడిపాల, పెనుమూరు, పూతలపట్టు, తవణంపల్లి, జీడీ నెల్లూరు తదితర ప్రాంతాలకు తిరిగేస్తున్నారు. తెలిసిన వ్యక్తులు, పలుకుబడి ఉన్న వ్యక్తులు, కూటమి నేతలు, పలుశాఖ అధికారుల ద్వారా టోకెన్ల కోసం బతిమిలాడుకుంటున్నారు. ఒక్క టోకెన్ అయినా తీసి ఇవ్వు స్వామీ అంటూ రైతులు వారిని ప్రాధేయపడుతున్నారు.

ప్రస్తుతం ఫ్యాక్టరీల వద్ద ఇబ్బంది పడుతోంది... సామాన్య రైతులేనని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం కొనాలంటే..మాకేమి లాభమని..ఫ్యాక్టరీలు పక్క రాష్ట్రాల కాయలపై మొగ్గు చూపుతున్నాయంటూ ఆగ్రహానికి గురవుతున్నారు. ఫ్యాక్టరీలు రూ.5, రూ.6ను కూడా తగ్గించేందుకు కుట్రలు చేస్తున్నాయని ఆరోపిస్తున్నారు. రైతులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

2018 నష్టాలు గుర్తుకొస్తున్నాయి..

ప్రస్తుతం మామిడి పరిస్థితి చూసి రైతులు 2018 మామిడి సంఘటనను గుర్తు చేసుకుంటున్నారు. అప్పట్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 40 శాతం పంట మాత్రమే వస్తే ఫ్యాక్టరీలు పంటను కొనకపోతే కాయలను తీసుకొచ్చి కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై పోసి నిరసనకు దిగారు. చివరకు కేజీ తోతాపురి రూ.2 వరకు పలికింది. నాటి టీడీపీ ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహక నిధి రూ.2.50 చొప్పున రూ.2.19 కోట్ల నిధుల చెల్లింపుల్లో జాప్యం చోటు చేసుకున్నాయి.

ముందే మామిడి కోతకు వెళ్లవద్దు

- మామిడి రైతులకు అధికారుల సూచన
- వర్షాలు వస్తే మా పరిస్థితి ఏంటి అంటున్న రైతులు
- ఆలస్యం చేస్తే చెట్లులోనే పండుతాయి
- పంట నేల రాలితే వచ్చే నష్టం ఎవరు భరిస్తారు ?
- మామిడి రైతుల ఆవేదన



కలెక్టరేట్ నుంచి మాట్లాడుతున్న అధికారులు

తిరుపతి అర్బన్: మామిడి రైతులు కంగారుపడి ముందే మామిడిపంట కోతకు వెళ్తున్నారని, అలా వెళ్లవద్దని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మామిడికోతలు, వాటి కొనుగోలుపై సీఎం చంద్రబాబునాయుడు మాట్లాడారని తెలియజేశారు. కలెక్టరేట్ నుంచి ఆయనతో పాటు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఉద్యానశాఖ అధికారులు హజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ మామిడి పంట సేకరణకు సంబంధించి సమాచారాన్ని రైతులకు అందిస్తామని వెల్లడించారు. జిల్లాలో 20,500 మంది మామిడి రైతులు ఈక్రాప్ చేశారని వారికి న్యాయం చేస్తామన్నారు. జిల్లాలో ఈ ఏడాది 1,45,00 మెట్రిక్ టన్నులు మామిడి ఉత్పత్తి రానుందని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 8 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల నుంచి 2,176 మంది రైతుల నుంచి 15 వేల మెట్రిక్ టన్నులు సేకరించినట్లు వివరించారు. 8 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు రోజు వారి సామర్థ్యం 2,200 మెట్రిక్ టన్నులు మాత్రమేనని వెల్లడించారు. ఆ మేరకు మాత్రమే వారు సేకరిస్తున్నారని రైతులకు కంగారు లేకుండా కోత ఉంటే అందరికీ సర్దుబాటు చేస్తామని స్పష్టం చేశారు.

రైతుల వాదన మరోలా..!

జిల్లావ్యాప్తంగా మామిడి రైతులపైనే చర్చ సాగుతోంది. అధికారులు తోతాపురి రకానికి కేజీ రూ.8 చొప్పున కొనుగోలు చేయాలని, ప్రభుత్వం కేజీకి రూ.4 ఇస్తుందని చెబుతున్నారు. ఇంతవరకు బాగానే ఉంది. అయితే కంగారు పడకండి అంటూ అధికారులు చెబుతున్నప్పటికీ రైతుల వాదన మరోలా ఉంది. ముందే వర్షాలు పదేపదే వస్తున్నాయి. ఈ కాలంలో వచ్చే అకాల వర్షాలకు టన్నుల కొద్దీ మామిడిపంట రాలిపోతుంది. ఆ పంట నష్టాన్ని ఎవరు భర్తీ చేస్తారు ? మరోవైపు పంట కోతకు సిద్ధంగా ఉంది. సమయం పడుతుందంటే ఎలా ? చెట్టులోనే పంట పండిపోయే ప్రమాదం ఉంది ? అలా పండిన పంట తప్పకుండా రాలిపోతుంది.. దాన్ని ఏం చేయాలి ? అంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎక్కడెక్కడ ఎంత టైం పడుతోందంటే..!

జిల్లాలోని 8 మామిడి జ్యూస్ ఫ్యాక్టరీలకు సంబంధించి.. రైతుల నుంచి మామిడి కొనుగులు చేయడానికి వేచి ఉండాల్సిన సమయాన్ని కలెక్టరేట్ నుంచి అధికారులు బుధవారం ఓ ప్రకటన ద్వారా వెల్లడించారు. ఇప్పటికే ఉన్న వాహనాలను తెలియజేశారు. అవి పూర్తి చేయడానికి పట్టే సమయాన్ని వెల్లడించారు. ఆ తర్వాత రైతుల నుంచి మామిడి సేకరించనున్నారు.

- నవ క్వాలిటీ ఫుడ్స్, ఎర్రావారిపాలెం దగ్గర అన్ని చాంబర్లు నిండుగా ఉన్నాయి. రైతులు వేచి ఉండాల్సిన సమయం 36 గంటల సమయం పడుతుంది.
- రాసా ఫుడ్స్, బీఎన్ కండ్రిగ దగ్గర ప్రస్తుతం రెండు వాహనాలు సరుకుతో ఉన్నాయి వేచి ఉండే సమయం మరో గంట సమయం.
- లియాన్ ఫుడ్స్, పుత్తూరు- 45 వాహనాలు ఉన్నాయి. అయితే వారు కొనుగోలు చేయడానికి 12 గంటల సమయం పడుతుంది.
- టాసా ఫుడ్స్, నారాయణవనం – 40 వాహనాలు ఉన్నాయి. 24 గంటల సమయం వేచి ఉండాల్సి ఉంది.
- శ్రీవర్ష ఫుడ్స్, రేణిగుంట – 20 వాహనాలు ఉన్నాయి. మరో 12 గంటల సమయం పడుతుంది.
- శ్రీదేవరాజు ఆగ్రో ఫుడ్స్, కేవీబీపురం –28 వాహనాలు ఉన్నాయి. మరో 12 గంటల సమయం పడుతుంది.
- క్యాప్రికాన్, సత్యవేడు–3 వాహనాలు ఉన్నాయి. మరో 5 గంటల సమయం పడుతుంది.
- సుప్రీం క్వాలిటీ ఫుడ్స్, పాకాల– 8 వాహనాలు ఉన్నాయి
- మరో 20 గంటల సమయం పడుతుంది

రైతులకు నష్టం రాకుండా చర్యలు

పాకాల : పక్వానికి వచ్చిన మామిడి కాయలను విడతల వారీగా కొయ్యాలని డీహెచ్ఓ దశరథరామిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన దామలచెరువులోని ర్యాంపులను పరిశీలించారు. ఒకటి రెండు ర్యాంపుల వద్ద మిగిలిపోయిన కాయలను ఇతర ర్యాంపుల వద్దకు తరలించి రైతులకు నష్టం రాకుండా చర్యలు చేపట్టారు. అలాగే మామిడి రైతులు ధైర్యంగా ఉండాలని, సప్లయర్స్ అన్ని కాయలను కొనుగోలు చేసేలా చర్యలు చేపడతామని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు రైతులకు ధైర్యం చెప్పారు. ర్యాంపునలను సందర్శించిన ఆయన మాట్లాడుతూ అధికారులు సూచనలు చేసిన విధంగా కాయలను కొయ్యాలన్నారు.

యోగా ఏర్పాట్ల పరిశీలన

తిరుపతి సిటీ: ఎస్వీయూ తారకరామా స్టేడియంలో ఈ నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించనున్నారు. బుధవారం ఈ మేరకు ఏర్పాట్లను జేసీ శుభం బన్సల్, కమిషనర్ మౌర్య, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఆర్డీఓ రామ్మోహన్, పర్యాటకశాఖ ఆర్డీ రమణ ప్రసాద్ పర్యవేక్షించారు. జేసీ మాట్లాడుతూ సుమారు 10 వేల మందితో యోగా డే నిర్వహించనున్నటుల వెల్లడించారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

పాకాల : స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. డీఎస్పీ ప్రసాద్, సాధిక్‌అలీ, సీఐ సుదర్శన్‌ప్రసాద్ పాల్గొన్నారు.

అక్రమ కట్టడం కూల్చివేత



తిరుపతి తుడా : అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనాన్ని బుధవారం నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు తొలగించారు. ఎర్రమిట్ట రాయల్ నగర్‌లోని 30 అంకణాల స్థలంలో నిర్మిస్తున్న భవనాన్ని కమిషనర్ మౌర్య ఆదేశాల మేరకు డీసీపీ ఖాన్ ఆధ్వర్యంలో సిబ్బంది పడగొట్టారు.

పాఠశాలల విలీనంపై ఆందోళన

తిరుపతి కల్చరల్ : మోడల్ ప్రైమరీ పాఠశాలలు ఏర్పాటులో భాగంగా జిల్లాలో 580 పాఠశాలు విలీనం చేయడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కుట్రపూరితంగా జిల్లాలో 580 పాఠశాలలను విలీనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియను నిలిపి వేయకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

స్థలాల విక్రయం దుర్మార్గం

తిరుపతి కల్చరల్ : కార్పొరేషన్ స్థలాలను విక్రయించేందుకు యత్నించడం దుర్మార్గమని సీపీఎం నగర కార్యదర్శి కె.వేణుగోపాల్ మండిపడ్డారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థకు ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మనస్తాపంతో మహిళ మృతి


మృతి చెందిన నీలిమ

తిరుపతి క్రైమ్: నగరంలో నివాసం ఉంటున్న ఓ మహిళ మనస్తాపంతో మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. అలిపిరి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జీవకోన సత్యనారాయణపురంలో నివాసం ఉంటున్న బాబు రెడ్డి, మణి కుమార్తె నీలిమ(29)కు ఆరేళ్ల కిందట వివాహమైంది. ఆమెకు నాలుగేళ్ల పాప ఉంది. అయితే నీలిమకు భర్తతో విభేదాలు ఉండడంతో నాలుగేళ్లుగా పుట్టింట్లోనే ఉంటోంది. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీనిపై ఆమె తల్లి ఫిర్యాదు మేరకు అలిపిరి పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాల తరలించారు.

బాలిక కనిపించలేదని ఫిర్యాదు

వాకాడు: మండలంలోని వేణుగోపాలపురం గ్రామానికి చెందిన తన కూతురు మంగళవారం రాత్రి నుంచి కనిపించడం లేదంటూ మైనర్ బాలిక తల్లి బుధవారం వాకాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వాకాడు మండలం చినతోట గ్రామానికి చెందిన ఓ యువకుడు మైనర్ బాలికను రాత్రి సమయంలో కారులో ఎత్తుకెళ్లినట్లు బాలిక ఫిర్యాదులో వివరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

● యోగాభ్యాసం



దైనందిన జీవితంలో యోగా ఒక భాగం కావాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. బుధవారం శ్రీకాళహస్తిలోని రాజగోపురం వద్ద నిర్వహించిన అంతర్జాతీయ యోగాంధ్ర-2025 కార్యక్రమాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరుడి చెంత యోగా కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, పర్యాటక రీజనల్ అధికారి రమణప్రసాద్, ఆలయ ఈఓ బాపిరెడి, జిల్లా పర్యాటక శాఖ అధికారి జనార్దన్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, మహిళలు, విద్యార్థులు, యోగ శిక్షకులు తదితరులు పాల్గొన్నారు. – శ్రీకాళహస్తి

యోగాలో విద్యార్థిని ప్రతిభ



తిరుపతి సిటీ : విజయవాడలో ఇటీవల నిర్వహించిన యోగాంధ్ర రాష్ట్రస్థాయి పోటీలలో తిరుపతి కేంద్రీయ విద్యాలయం విద్యార్థిని చీమలమర్రి దీపిక అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రెండవ స్థానం దక్కించుకుంది. బుధవారం ఈ మేరకు మంత్రి చేతులమీదుగా ప్రశంసాపత్రం అవార్డును అందుకుంది.

అక్రమ రిజిస్ట్రేషన్‌పై కొరడా

- ఆర్కే గార్డెన్స్‌కు జరిమానా విధింపు
- జిల్లా రిజిస్ట్రార్ విచారణలో అక్రమాలు బహిర్గతం
- రూ.10.80 లక్షల స్టాంపు డ్యూటీ చెల్లించాలంటూ ఆదేశం
- ఫలించిన సమాచార హక్కుల వేదిక పోరాటం


ఆర్.కె.గార్డెన్ ఫంక్షన్ హాల్

పుత్తూరు : మండల పరిధిలోని ఆర్కే గార్డెన్స్ ఫంక్షన్ హాల్ యజమాని రవీంద్రన్‌కు రూ.10.80 లక్షల స్టాంప్ డ్యూటీతో పాటు అపరాధ రుసుం చెల్లించాలంటూ తిరుపతి జిల్లా రిజిస్ట్రార్ శ్రీరామ్‌కుమార్ ఆదేశించారు. ఈ మేరకు ఆర్డర్ కాపీని గత మే నెల 29వ తేదీన జారీ చేశారు. ఆర్డర్ కాపీ అందుకున్న 15 రోజుల్లోపు స్టాంప్ డ్యూటీ మొత్తాన్ని చెల్లించాలని లేని పక్షంలో ఇండియన్ స్టాంప్స్ సెక్షన్ 1899 చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

నివాస ఖాళీ స్థలంగా చూపడంతో..

స్థానిక ఎన్జీఓ కాలనీలో నివాసం ఉంటున్న ఎం.రవీంద్రన్ పుత్తూరు మండలం ఉత్తరపుకండ్రిగ పంచాయతీ చిన్నబ్బనాయుడు కండ్రిగ వద్ద ఆర్కే గార్డెన్ ఫంక్షన్ హాల్ నిర్మించారు. ఆయన 2023 డిసెంబర్ 13, 14 తేదీల్లో పుత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కుమార్తె ప్రత్యూష పేరిట సదరు ఆస్తిని రిజిస్టర్ చేయించారు. సదరు ఆస్తిని ఖాళీ స్థలంగా చూపుతూ డిక్లరేషన్ ఇచ్చారు. ఆస్తి విలువ రూ.1,08,96,604గా పేర్కొన్నారు.

సమాచార హక్కుల వేదిక ఫిర్యాదు

పుత్తూరు మండలం ఆర్కే గార్డెన్స్ నిర్మాణానికి పంచాయతీ నుంచి, తుడా కార్యాలయం నుంచి పొందిన అనుమతులను కోరుతూ స్థానిక సమాచార హక్కుల వేదిక కార్యదర్శి మురగారెడ్డి ఆర్టీఐ ద్వారా సమాచారాన్ని కోరడంతో అసలు విషయం బయట పడింది.

కేవలం రూ.2.18 లక్షలు చెల్లించి..

స్టాంప్ డ్యూటీ రూ.12.94 లక్షలు కాగా, రవీంద్రన్ ఇచ్చిన తప్పుడు డిక్లరేషన్ ద్వారా కేవలం రూ.2.18 లక్షలు మాత్రం చెల్లించినట్లు విచారణలో తేటతెల్లం అయింది. దీంతో డెఫిసిట్ రిజిస్ట్రేషన్ ఫీజు రూ.4,720తో కలిపి మొత్తం రూ.10,80,520 చెల్లించాలంటూ రవీంద్రన్‌ను ఆదేశించారు.

జిల్లా రిజిస్ట్రార్ విచారణ ఇలా..

- సమాచార హక్కుల వేదిక వారు ఆర్టీఐ ద్వారా అడిగిన వివరాల మేరకు తిరుపతి జిల్లా రిజిస్ట్రార్ చేపట్టిన విచారణలో వాస్తవాలు వెలుగు చూశాయి.
- జిల్లా రిజిస్ట్రార్ ఆదేశాల మేరకు పుత్తూరు ఎంపీడీఓ స్థల పరిశీలన చేసి ఇచ్చిన నివేదికలో సర్వే నంబర్ 145-1ఏ2, 145-2సి2లో 2023 డిసెంబర్ నాటికే ఆర్కే గార్డెన్ ఫంక్షన్ హాలు నిర్మాణం పూర్తయిందని తెలిపారు.
- పుత్తూరు సబ్ రిజిస్ట్రార్ సైతం స్థల పరిశీలన చేసి శాశ్వత భవనాలు ఉన్నట్లు గుర్తించి, మార్కెట్ విలువను దాచిపెట్టి రిజిస్ట్రేషన్ జరిగినట్లు నివేదిక ఇచ్చారు.
- ఆర్‌సీసీ నిర్మాణం 2,591 చదరపు అడుగులు, ఏసీసీ నిర్మాణం 17,361 చదరపు అడుగులుగా నివేదికలో పొందుపరిచారు.
- రవీంద్రన్ తెలిపిన ఆస్తి విలువ రూ.1.8 కోట్లు కాగా విచారణలో మొత్తం ఆస్తి విలువ రూ.6.47 కోట్లుగా లెక్కగట్టారు.

ఫిర్యాదు మేరకే విచారణ చేపట్టాం

ఆర్కే గార్డెన్స్ క్రయ విక్రయాలపై వచ్చిన ఫిర్యాదు మేరకే విచారణ చేపట్టాం. విచారణలో పుత్తూరు ఎంపీడీఓ 2023 డిసెంబర్‌కు ముందే ఆ నిర్మాణాలపై నోటీసులు ఇచ్చినట్లు నివేదికలో పేర్కొన్నారు. 2023 డిసెంబర్‌లో జరిగిన ఈ రిజిస్ట్రేషన్ స్టాంప్స్ చట్టం సెక్షన్ 27కి వ్యతిరేకంగా ఉన్నట్లు తేలింది. దీంతో పూర్తి స్థాయి స్టాంప్ డ్యూటీ చెల్లించాలని ఆదేశించాం.
– జి.శ్రీరామ్‌కుమార్, జిల్లా రిజిస్ట్రార్, తిరుపతి

అప్పల బాధ తాళలేక..


మృతి చెందిన నాగేందర్ రెడ్డి

తిరుపతి క్రైమ్: అప్పుల బాధ తాళలేక వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన దంపతులు తిరుపతిలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వైఎస్సార్ కడప జిల్లా సిద్ధవటం మండలం దేగవాండ్లపల్లికి చెందిన నిమ్మకాయల నాగేందర్ రెడ్డి(35) భార్య పుష్పవేణితో కలిసి బుధవారం తిరుపతికి చేరుకున్నాడు. నగరంలోని ఓ ప్రైవేట్ లాడ్జిలో రూము తీసుకుని వేకువజామున భార్యాభర్తలు ఇద్దరూ విషం సేవించారు. అయితే ఈ విషయం వారి కుటుంబీకులకు తెలియడంతో స్థానికుల సహాయంతో నాగేందర్ రెడ్డి తండ్రి మునిరెడ్డి వెంటనే వారిని ఆస్పత్రికి తరలించారు. అయితే హాస్పిటల్లో చికిత్స పొందుతూ నాగేందర్ రెడ్డి మృతి చెందగా.. ఆయన భార్య పుష్పవేణి వెంటిలేటర్‌పై చికిత్స పొందుతోంది. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి కూడా విషమంగా ఉందని డాక్టర్లు తెలిపారు. అలిపిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

ఆలస్యం.. ప్రచార ఆర్భాటం



తిరుపతి అర్బన్: జిల్లాలోని రైతులకు ఏప్రిల్, మేలో ప్రభుత్వం అందించిన రాయితీ పనిముట్లను అధికారులు పంపిణీ చేశారు. అందులో టీడీపీ నేతలు సిఫార్సు మేరకు పనిముట్లు ఇచ్చారనే విమర్శలు వచ్చాయి.అయితే పనిముట్లు ఇచ్చిన రెండు నెలలు తర్వాత బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్, డీఏఓ ప్రసాద్‌రావు నేతృత్వంలో సమావేశం నిర్వహించి తాము 1,678 మంది రైతులకు ఇచ్చామని చెప్పడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

విద్యార్థుల భద్రతే ముఖ్యం

– జిల్లా రవాణాశాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్

తిరుపతి మంగళం : జిల్లా పరిధిలో స్కూళ్లు, కళాశాలలు ప్రారంభమైన నేపథ్యంలో ఫిట్‌నెస్ లేకుండా, చేయించుకోకుండా స్కూళ్ల, కళాశాలల బస్సులు రోడ్లపై తిప్పితే ఆ వాహనాలను సీజ్ చేయడంతో పాటు కఠిన చర్యలు తప్పవని జిల్లా రవాణాశాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్ హెచ్చరించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుపతి జిల్లా పరిధిలో స్కూళ్లు, కళాశాలలకు సంబంధించి సుమారు 1700 బస్సులు, వ్యాన్లు ఉన్నాయని తెలిపారు. అందులో ఇప్పటికే 1400 బస్సులకు ఫిట్‌నెస్ చేయించుకున్నారని, మిగిలిన 300 బస్సుల్లో కొన్ని కాలం చెల్లినవి, మరికొన్ని ఫిట్‌నెస్ చేయించుకోవసినవి ఉన్నాయన్నారు. విద్యార్థుల భద్రతే తమకు ముఖ్యమన్నారు. వాహన సామర్థ్య ధ్రువీకరణ పత్రం లేకుండా విద్యార్థులను తరలించరాదని ఇప్పటికే ఆయా పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలకు హెచ్చరికలు జారీ చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే నిబంధనలు పాటించని 15 బస్సులపై ఎంవీఐ అధికారులు కేసులు నమోదు చేశారని, అలాగే జరిమానా రూపంలో రూ.2 లక్షలు వసూలు చేశారన్నారు. కరకంబాడి సర్కిల్, రామాంజపల్లి జంక్షన్, రేణిగుంట రోడ్డు, తిరుచానూరు రోడ్డు మార్గాల్లో మోటార్ వాహన తనిఖీ అధికారులు వనం వెంకట సుబ్రహ్మణ్యం, శ్రీనివాస రావు, అతికా నాజ్, మోహన్ కుమార్, ఆంజనేయ ప్రసాద్, రమణ నాయక్ విస్తృతంగా తనిఖీలు నిర్వహించడం జరుగుతోందన్నారు.

క్లుప్తంగా

సీపీఐ నేతకు మాతృవియోగం



నివాళులర్పిస్తున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : నగరంలోని సీపీఐ నేత కుమార్‌రెడ్డి మాతృమూర్తి యర్రమ్మ బుధవారం కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి వారి నివాసానికి వెళ్లి యర్రమ్మ భౌతికకాయానికి నివాళులర్పించారు. కుమార్‌రెడ్డి, కుటుంబీకులను పరామర్శించారు.

వీడ్కోలు సత్కారం



ధనంజయను సన్మానిస్తున్న పెన్షనర్లు

పాకాల : ఉపఖజానా కార్యాలయం యూడీసీ ధనంజయ బదిలీపై పీలేరుకు వెళుతున్నారు. బుధవారం ఈ సందర్భంగా ఆయనను పెన్షనర్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. అలాగే పుత్తూరు నుంచి బదిలీపై పాకాలకు వచ్చిన యూడీసీ నాగజ్యోతికి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎస్టీఓ జ్ఞానప్రసూన, పెన్షనర్స్ పాకాల యూనిట్ అధ్యక్షుడు పీఆర్ మునస్వామి, ప్రధాన కార్యదర్శి ఎం.కుప్పుస్వామినాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు జయరామ్‌నాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, కేఎస్ తులసీరామన్, దొరస్వామినాయుడు, శంకరనాయుడు, దేశప్పనాయుడు, సుబ్రమణ్యంశెట్టి పాల్గొన్నారు.

'సాయి సుధా'లో బీఎండీ పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సుకుమార్

తిరుపతి తుడా : రెడ్డి అండ్ రెడ్డి కాలనీలోని శ్రీసాయి సుధా మల్టీ స్పెషాలిటీ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత బీఎండీ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ బి.సుకుమార్‌తో పాటు ముంబాయికి చెందిన ఇంటస్ ఫార్మా లిమిటెడ్ కంపెనీ సిబ్బంది హాజరై రోగులకు సలహాలు అందించారు. సుకుమార్ మాట్లాడుతూ 45 ఏళ్లు పైబడిన వారు ఎముకల సాంద్రత పరీక్షించుకోవాలని సూచించారు. వైద్యులు సుధారాణి, సుబ్బా నాయుడు, వినయ్ కుమార్, హిమబిందు, ఫిజియోథెరపిస్ట్ సునీత, సురేంద్ర, సుజాత, పార్వతి, శీను,హేమంత్, నరేంద్ర, సిస్టర్స్ మేరీ సంధ్య, సింధు, కంపెనీ ప్రతినిధి శ్రీనాథ్ పాల్గొన్నారు

రగులుతున్న చంద్రగిరి

చెవిరెడ్డి అక్రమ అరెస్ట్‌పై చంద్రగిరి నియోజకవర్గం రగులుతోంది.. ఆయన చేసిన తప్పేంటని నిలదీస్తోంది.. అర్ధరాత్రి సమయంలో అదుపులోకి తీసుకోవాల్సి అవసరమేంటని ప్రశ్నిస్తోంది. మద్యం అనే మాటే గిట్టని నేతకు లిక్కర్ మరక అంటించడమేంటని మండిపడుతోంది.. కోవిడ్ సమయంలో పార్టీలకు అతీతంగా సేవలందించినందుకు ఇదా బహుమతి అంటూ ఆవేదన వ్యక్తం చేస్తోంది. అధికారం చేతిలో ఉన్నప్పటికీ ప్రతిపక్ష నేతలకు హాని తలపెట్టని మంచితనానికి ఇదేనా గౌరవం అంటూ ఆవేదన చెందుతోంది. పల్లెసీమలను సైతం ప్రగతి పథంలో నడిపించిన ప్రజానాయకుడికి ఇంత అన్యాయం చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.



చెవిరెడ్డి ఇంటి ముందు పెద్ద సంఖ్యలో గుమి కూడిన పార్టీ నేతలు, కార్యకర్తలు



ఎస్‌ఐకి వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

- చెవిరెడ్డి చేసిన తప్పేంటి..?
- కోవిడ్ సమయంలో టీడీపీ వాళ్లకు సాయం చేసినందుకా..?
- పండగ కానుకలిచ్చి అందరికీ ఆనందం పంచినందుకా
- రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసినందుకా..?
- చెవిరెడ్డి అక్రమ అరెస్ట్‌పై జనాగ్రహం

తిరుపతి రూరల్ : చెవిరెడ్డి మద్యం అమ్మారంట అంటే చంద్రగిరి నియోజకవర్గంలోనే కాదు.. రాష్ట్రంలో ఆయన గురించి బాగా తెలిసిన వారెవరూ నమ్మరు. ఎన్నికల్లో మద్యం పంచాలని వచ్చే నాయకుల ముఖం మీదనే మందు మాత్రం ఇవ్వను.. ఇంక ఏదైనా అడగండి, మందు పంచితే వచ్చే ఓట్లు నాకు అవసరం లేదని స్పష్టంగా చెప్పే నాయకుడు ఒక్క చెవిరెడ్డి మాత్రమే. అలాంటి వ్యక్తిని లిక్కర్ కేసులో ఇరికించి అర్ధరాత్రి పూట అక్రమంగా అరెస్టు చేయడం ఏంటి..? ఇంత దుర్మార్గమా..? ఇది కూటమి ప్రభుత్వ అరాచకానికి పరాకాష్ట కాదంటారా.? చంద్రగిరి నియోజకవర్గంలో ప్రజలను తన బిడ్డల్లా చూసుకున్నారు.. కరోనా సమయంలో టీడీపీ వాళ్లకు సైతం సాయం చేసి ప్రాణాలు కాపాడారు.. అప్పట్లో ప్రతిపక్షనేత హోదాలో చంద్రబాబు, ఆయన కుటుంబీకులు చంద్రగిరికి వచ్చినప్పుడు సగౌరవంగా చూసుకున్నారు.. ఆపదంటే ఆలోచించకుండా సాయం చేశారు.. పండుగలు వస్తే తన కుటుంబంతో పాటు చంద్రగిరి ప్రజలందరి కుటుంబాల్లో ఆనందం నింపాలని కానుకలు పంపించారు.. రాజకీయాలకు అతీతంగా పల్లెల్లో ప్రగతిని పరుగులు పెట్టించారు.. ఇంత చేసిన చెవిరెడ్డిని ఎందుకు అరెస్టు చేశారు..? ప్రజలకు అన్ని రకాలుగా మంచి చేసినందుకా..? అంటూ చంద్రగిరి నియోజకవర్గవాసులు, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు కూటమి ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. చెవిరెడ్డి అక్రమ అరెస్టును సంఘటితంగా ఎదుర్కొంటామని, ఆయనకు ఏ సబంధంలేని లిక్కర్ కేసులో అక్రమంగా అరెస్టు చేసినా, చెవిరెడ్డి అతిత్వరలో కడిగిన ముత్యంలా బయటకు వస్తారని ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు. చెవిరెడ్డి అక్రమ అరెస్టుపై రగిలిపోతున్న పార్టీ శ్రేణులు ఏమంటున్నాయంటే...

భయపడేది లేదు



చెవిరెడ్డిని అక్రమంగా అరెస్టు చేస్తే క్యాడర్ భయపడుతుందనుకుంటారేమో.. ఎట్టి పరిస్థితుల్లో భయపడేది లేదు. మీరు ఎంత తొక్కాలని చూస్తే మేమంతగా ఎగురుతాం. మా చెవిరెడ్డి ఉద్యమం నుంచి వచ్చిన వ్యక్తి. ఆయనే మాకు ఆదర్శం. పోరాటాలు మాకు కొత్త కాదు.

- నంగా నరేష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, పాకాల

వేధింపులకు గురిచేస్తోంది



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు మంచి చేయడం మానేసింది. వైఎస్సార్‌సీపీ నేతల్లో యాక్టివ్‌గా ఉన్నవారిని టార్గెట్ చేసింది. అందులో భాగంగానే చెవిరెడ్డిపై కక్షకట్టి వేధింపులకు గురిచేస్తోంది.

- ఎద్దుల చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, ఆర్సీపురం

రెడ్‌బుక్ రాజ్యాంగం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంబేడ్కర్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టేశారు.లోకేష్ రాసిన రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారు. అందుకే ప్రజాస్వామ్యం చచ్చిపోతోంది.

- సింహాల మోహన్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, చిన్నగొట్టిగల్లు

అంత కక్ష ఎందుకో..?



పది మందికి మంచి చేయడం మాత్రమే చెవిరెడ్డికి తెలుసు. ఆయనకు నచ్చకుంటే దూరంగా పెడతారు తప్ప చెడ్డ చేయడం తెలియదు. ఎవరినైనా గౌరవించడం ఆయన సంస్కారం. చెవిరెడ్డిపై ప్రభుత్వానికి అంత కక్ష ఎందుకో అర్థం కావడం లేదు.

- నాగార్జున రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, ఎర్రావారిపాళెం

చెవిరెడ్డికి ఎదురు లేదు



చంద్రగిరి గడ్డపైన చెవిరెడ్డికి ఎదురులేదు. మొన్న జరిగిన ఎన్నికల్లో ఓటమి చెందినా సరే చెవిరెడ్డిని మాత్రమే ఎమ్మెల్యేగా నేటికీ ప్రజలు భావిస్తున్నారు. ఆయన బిడ్డను అక్కున చేర్చుకుని ఆదరిస్తున్నారు.

- కొటాల చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, చంద్రగిరి.

చెవిరెడ్డి అంటే భయం



జగనన్న వెంట ఉంటూ పార్టీని చక్కబెడుతున్న చెవిరెడ్డి అంటే కూటమి నేతలకు భయం. అసలే జగనన్నకు జనంలో వున్న క్రేజ్ చూసి తట్టుకోలేక పోతున్నారు. చెవిరెడ్డి అన్న చూసి కూటమి నేతలకు కుళ్లు పట్టుకుంది.

- నాగభూషణమ్మ, తెలుగు మహిళ అధ్యక్షులు, తిరుపతి రూరల్

మంచిని ఓర్వలేకనే



చంద్రగిరి నియోజకవర్గంలో ప్రజలకు చెవిరెడ్డి చేసిన మంచిని ఓర్వలేకనే ఆయనపై కక్షకట్టారు. ప్రజలకు మాయమాటలు చెప్పి ఓట్లు వేసుకుని మోసం చేసిన కూటమి నేతలు ఆయనను జైలు పాలు చేసి అపనిందలు వేస్తున్నారు. -

- వేముల యశోద, వైస్ఎంపీపీ, తిరుపతి రూరల్

తోడుగా ఉంటాం



మా చెవిరెడ్డి అన్న కష్టంలో అందరికీ తోడుగా నిలబడ్డాడు. ఆయనను అక్రమంగా అరెస్టు చేసి ఆ కుటుంబానికి దూరం చేశారు. మా అన్న కుటుంబానికి మేమంతా తోడుగా నిలబడతాం.

- మొక్కల భారతి, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ మహిళా అధ్యక్షులు

పతనం తప్పదు



కులం, మతం, పార్టీ అనే తేడాలు లేకుండా చెవిరెడ్డి అందరికీ మంచి చేశాడు. అందరినీ ఒకేలా చూసుకుని ప్రతి కుటుంబంలో ఆనందాన్ని నింపాడు. అలాంటి మంచి వ్యక్తిని టచ్ చేశారు. వారికి పతనం తప్పదు.

- కళావతమ్మ, సర్పంచ్, చెన్నుగారిపల్లె, పాకాల

నిరసనకు అనుమతి కోసం వినతి

చంద్రగిరి : మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అక్రమ అరెస్టుకు నిరసన తెలిపేందుకు అనుమతి మంజూరు చేయాలని వైఎస్సార్‌సీపీ నేతలు కోరారు. బుధవారం ఈమేరకు ఎస్‌ఐ అనితకు వినతిపత్రం అందించారు. పార్టీ మండల అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మద్యం పేరు వింటేనే ఆమడ దూరం ఉండే చెవిరెడ్డిని మద్యం స్కామ్ పేరుతో అక్రమంగా అరెస్టు చేయడం దారుణమన్నారు. కూటమి పాలనలో కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని , అన్యాయంగా కేసులు వేధిస్తున్నారన్నారు. చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కష్టపడిన చెవిరెడ్డిని తప్పుడు కేసులతో అరెస్ట్ చేయడంపై గురువారం సాయంత్రం శాంతియుతంగా నిరసన తెలపనున్నట్లు వెల్లడించారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, చెవిరెడ్డి అభిమానులు, ప్రజలు స్వచ్ఛందంగా నిరసన కార్యక్రమంలో పాల్గొని మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు.

కట్టుదిట్టంగా నిఘా



మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

తిరుపతి క్రైమ్: ఆధ్యాత్మిక నగరంలో క్రైమ్‌కు చెక్ పెట్టడానికి పోలీసులు కట్టుదిట్టంగా సీసీ కెమెరాలతో నిఘా పెట్టారని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారంజీవకోనలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎస్పీ హర్షవర్ధన్‌రాజుతో కలసి ప్రారంభించారు.కలెక్టర్ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు అత్యాధునిక టెక్నాలజీని వినియోగిస్తున్నారని వెల్లడించారు. ఎస్పీ మాట్లాడుతూ జీవకోనని 40 ప్రదేశాల్లో 124 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.జెమినీ ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్(ఫ్రీడమ్ ఆయిల్)హైదరాబాద్‌కు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి సహకారంతోపాటు తిరుపతి చాంబ్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ వారి సహకారంలో రూ.31లక్షలు విలువ చేసే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని వివరించారు. అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీలు భక్తవత్సలం, శ్యామ్‌సుందరం పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

- శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఉదయం 8.30 గంటలకు హుండీ లెక్కింపు.
- ప్రెస్‌క్లబ్‌లో మధ్యాహ్నం 12 గంటలకు ఆలిండియా బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ కో–ఆర్డినేటర్ పూర్ణచంద్రరావు మీడియా సమావేశం.
- కలెక్టరేట్‌లోని రెండవ అంతస్తులో మధ్యాహ్నం 12 గంటలకు జాతీయ మహిళా కమిషన్ సభ్యులు డాక్టర్ అర్చనా మంజుందారు జిల్లాలోని మహిళల సమస్యలపై జన్ సూన్వాయి కార్యక్రమం.
- తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధమైన శ్రీసుందరాజస్వామి ఆలయంలో స్వామివారి అవతారోత్సవాలలో భాగంగా సాయంత్రం 6 గంటలకు తిరుచ్చి ఉత్సవం. రాత్రి 7 నుంచి 8.30 గంటల మధ్య గరుడ వాహన సేవ.
- తిరుపతిలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద శ్రీనివాసం, రైల్వేస్టేషన్ సమీపంలోని విష్ణు నివాసం, అలిపిరిలోని భూదేవి కాంప్లెక్స్‌లో తిరుమలకు నడక మార్గంలో వెళ్లే భక్తులకు సాయంత్రం 3.30 నుంచి 4 గంటల వరకు శ్రీవారి దర్శన టోకెన్ల పంపిణీ.
- జిల్లాలోని 8 కేంద్రాలలో ఉదయం 9.30 నుంచి 12 గంటలు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెగా డీఎస్సీ పరీక్షలు.
- పుదిపట్ల రామకృష్ణ మందిరంలో సాయంత్రం 6.30 గంటలకు శ్రీమద్భాగవత సప్తాహం.

కూటమిపై తిరుగుబాటు!

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ స్థిరాస్తిని కారు చౌకగా కొట్టేసేందుకు చేసిన కుట్రకు కౌన్సిల్ చెక్‌పెట్టింది. విధి విధానాలు లేకుండా ఓ మంత్రి వేసిన పన్నాగాన్ని వ్యతిరేకించింది. ఆర్‌టీసీ బస్టాండ్ సమీపంలో అత్యంత విలువైన స్థలం అమ్ముకోవడమంటే నగర భవిష్యత్‌ను నాశనం చేయడమేనని స్పష్టం చేసింది. పెండింగ్ పనుల పూర్తికి అవసరమైన నిధులను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సమకూర్చుకోవాలని సూచించింది. అనాలోచిత నిర్ణయానికి ఎట్టిపరిస్థితుల లోనూ మద్దతు పలకమని తెగేసి చెప్పింది. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లతో పాటు ఇటీవల గోడ దూకిన కార్పొరేటర్లు సైతం తిరగబడడంతో కూటమికి దిక్కుతోచని స్థితి ఎదురైంది.

- స్థిరాస్తి విక్రయ కుట్రను అడ్డుకున్న కార్పొరేటర్లు
- చౌకగా కొట్టేయాలనుకున్న మంత్రి ఆలోచనకు చెంపపెట్టు
- అమ్మకాన్ని తీవ్రస్థాయిలో వ్యతిరేకించిన కౌన్సిల్
- దిక్కుతోచని స్థితిలో ఎమ్మెల్యే జోక్యం.. కమిటీ ఏర్పాటుకు సూచన
- ఆ స్థలం అమ్మితే చరిత్ర హీనులవుతామన్న మేయర్ శిరీష

తిరుపతి తుడా: ఎస్వీయూ సెనెట్ హాల్‌లో బుధవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మేయర్ శిరీష అధ్యక్షతన చేపట్టిన కౌన్సిల్ మీటింగ్‌కు 41 మంది కార్పొరేటర్లు, నలుగురు కో–ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫిషియో సభ్యుల హోదాలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరయ్యారు. కమిషనర్ మౌర్య సభను నడిపించగా, మొత్తం 84 అంశాలను అజెండాగా ప్రవేశపెట్టారు. అలాగే టేబుల్ అజెండాగా రెండు అంశాలను తీసుకువచ్చారు. అందులో ఆర్‌టీసీ బస్టాండ్‌కు సమీపంలోని విలువైన స్థలం విక్రయించాలని పొందుపరిచారు.



మీడియాతో మాట్లాడుతున్న మేయర్ శిరీష

ఈ ప్రతిపాదనను కౌన్సిల్ తీవ్రంగా వ్యతిరేకించింది. 47మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనగా కార్పొరేషన్ స్థల విక్రయాన్ని 35మంది సభ్యులు అడ్డుకున్నారు. మిగిలిన 12మందిలో ఐదుగురు కార్పొరేషన్ స్థలాన్ని విక్రయించాలని మద్దతు పలికారు., మరో 7మంది సభ్యులు స్థల విక్రయాన్ని వ్యతిరేకిస్తూనే ఎమ్మెల్యే ప్రతిపాదించిన కమిటీకి అనుకూలంగా ఓటేశారు. మెజారిటీ సభ్యులు స్థల విక్రయాన్ని వ్యతిరేకించడంతో కౌన్సిల్ ఆమోదం లభించలేదు. ఊహించని పరిణామంతో ప్రభుత్వ పెద్దల నుంచి మొట్టికాయ తప్పదని భావించిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు విషయాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారు. మెజారిటీ సభ్యులు స్థలం అమ్మకాన్ని వ్యతిరేకించిన నేపథ్యంలో ఇందుకు సంబంధించి విధి విదానాలు, అసలు విక్రయించాలా వద్దా...అనేదానిపై కమిటీ వేద్దాం అంటూ మాయచేసేందుకు విఫలయత్నం చేశారు. ఈ క్రమంలోనే టేబుల్ అజెండాలోని బాలాజీకాలనీ మూడో వీధి 60 అడుగుల రోడ్డును 40 అడుగులకు కుదిస్తూ చేసిన ప్రతిపాదనకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.



కౌన్సిల్‌లో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్యే ఆరణి

ప్రజలు హర్షించరు : మేయర్

కార్పొరేషన్ భవిష్యత్ అవసరాలకు సరిపడ స్థలాలు లేకపోయిన విషయం పాలకులతో పాటు ప్రజలకు తెలుసన్నారు. ఈ క్రమంలో ఉన్న ఒకటి, రెండు స్థలాలను కూడా అమ్ముకోవడం అంటే నగర భవిష్యత్‌ను నాశనం చేయడమేనని స్పష్టం చేశారు. ఈ మేరకు పార్టీలకతీతంగా వ్యతిరేకించడం హర్షణీయమన్నారు. కార్పొరేషన్ నూతన భవన నిర్మాణానికి అవసరమైన నిధుల సమీకరణకు మరో ప్రత్యామ్నాయం చూడాలని, ఆస్తులు అమ్ముకోవడం సరైన నిర్ణయం కాదని వెల్లడించారు. ఈ కౌన్సిల్ అందుకు సిద్ధంగా లేదని తెగేసి చెప్పారు.

అమ్మితీరాలన్న డిప్యూటీ మేయర్లు

కార్పొరేషన్ స్థలాన్ని అమ్మితీరాల్సిందేనని డిప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, ఆర్‌సీ మునికృష్ణ కౌన్సిల్‌లో పట్టుపట్టడం చర్చనీయాంశమైంది.

శ్మశాన స్థలం కాపాడండి

తిరుపతి మంగళం : తిమ్మినాయుడుపాళెం గ్రామస్తులకు సంబంధించిన వందనాలు శ్మశాన స్థలం కాపాడాలని తిరుపతి 50వ డివిజన్ కార్పొరేటర్ బోకం అనిల్ కోరారు. బుధవారం తిరుపతి కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో కమిషనర్కు విజ్ఞప్తి చేశారు. తిమ్మినాయుడుపాళెం గ్రామ లెక్క దాఖలా సర్వే నంబర్ 199లో.1.45 సెంట్లను సుమారు వందేళ్లుగా శ్మశాన వాటికగా వాడుకుంటున్నారని తెలిపారు. అందులో కర్మక్రియల మండపం, బోరును ప్రభుత్వమే ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. గ్రామానికి చెందిన కొందరు సమీపంలోని అటవీ భూమిలో శ్మశాన వాటికకు స్థలం కేటాయిస్తామని, ఈ భూమిని కబ్జా చేశారని ఆరోపించారు. అయితే అటవీభూమిలో శ్మశాన వాటికను ఏర్పాటు చేయవద్దని ఫారెస్ట్ అధికారులు నోటీసులు సైతం జారీ చేశారని వెల్లడించారు. కబ్జాకోరల్లో చిక్కిన శ్మశాన వాటిక భూమిలో అక్రమ కట్టడాలను తొలగించి, తమ గ్రామానికి అప్పగించాలని కోరారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ బోకం అనిల్


ఇంజనీరింగ్‌లో ఉచిత అడ్మిషన్లు



మాట్లాడుతున్న మారియప్పన్

తిరుపతి సిటీ : తమిళనాడులోని తిరునల్వేలిలోని పీఎస్ఎన్ గ్రూప్స్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్‌లోబీఈ, బీటెక్ కోర్సులో అడ్మిషన్లు జరుగుతున్నాయని కళాశాల వైస్ చైర్మన్ ప్రొఫెసర్ మారియప్పన్ తెలిపారు. బుధవారం న్యూబాలజీ కాలనీలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సెమినార్ ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తమ కళాశాల నిర్వహించే కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన 50 మంది ఆంధ్ర విద్యార్థులకు ఉచిత అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఎంసెట్ ఉత్తీర్ణులైన, కాకపోయినా ఎంట్రన్స్ టెస్ట్‌కు హాజరుకావచ్చన్నారు. వివరాలకు 8341359208 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో ప్రొఫెసర్ మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

హనుమపై 'సుందర' విహారం



ఊరేగుతున్న స్వామివారు

చంద్రగిరి: తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ సుందరరాజ స్వామివారి అవతార మహోత్సవాలు రెండో రోజు బుధవారం వైభవంగా సాగాయి. ఈ సందర్భంగా ఉదయం స్వామివారు హనుమంత వాహనంపై మాడ వీధుల్లో విహరించారు. ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈఓ దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ చలపతి పాల్గొన్నారు.

టీటీడీకి రూ.10 లక్షల విరాళం

తిరుమల : హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస అనిదత్ అనే భక్తుడు బుధవారం టీటీడీ శ్రీవేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.10,00,116 విరాళంగా అందించారు. ఈ మేరకు దాత తరఫున ఆయన ప్రతినిధి వై.రాఘవేంద్ర తిరుమలలో అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరికి డీడీని అందజేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

తిరుపతి కల్చరల్: ప్రతి ఒక్కరూ తమ దినచర్యలో యోగాను భాగం చేసుకోవాలని, తద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో జీవనం సాగించవచ్చని పద్మావతి మహిళా వర్సిటీ ప్రొఫెసర్ హైమావతి తెలిపారు. బుధవారం సంజయ్ గాంధీ కాలనీలోని రాస్ క్లస్టర్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఇందిర, ప్రీతి, కల్యాణి, స్వాతి, నిర్మల, లలిత, ఎల్.బాలాజీ, టి.జ్యోతి పాల్గొన్నారు.

బడి మార్పుపై మండిపాటు



నిరసన తెలుపుతున్న పిల్లలు, తల్లిదండ్రులు

రామచంద్రాపురం : మండలంలోని పీవీపురంలో ఏళ్ల తరబడి పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించిన బడిని బలిజపల్లెకు మార్పు చేస్తుండడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు మండిపడ్డారు. బుధవారం ఈ మేరకు పాఠశాల ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు.

వ్యాను బోల్తా

పాకాల : పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై శంఖంపల్లి సమీపంలో అనంత ఆంజనేయస్వామి ఆలయం బుధవారం ఓ వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులు గాయపడ్డారు. క్షతగాత్రులను 108లో తిరుపతి రుయాకు తరలించారు.